# పరిష్కారం

## కె. రామలక్ష్మి



ఇంకా పూర్తిగా తెల్లార్లేదు. అసలు వచ్చి పడుకున్నదే మూడు గంట్లవేళ. "ఏమిటో యీ తెలుగువాళ్ల పెళ్లి ముహూర్తాలు - నిద్ర కళ్లతో పెళ్లి పందిట్లో ఒత్తి జోరిగల్లాగా తిరగాలి కాబోలు పెళ్లికొచ్చినవాళ్లు" పెళ్లి మంటపం ముందు కూర్చుని గుస గుసలాడింది జయ. శాంత ష్ అని కోప్పడింది కూడా. అప్పుడింక జిలకర్ర బెల్లం నెత్తి నెట్టి బజంత్రీలు చెవులు చిల్లులు పడేలాగ మ్రోగించారు. శాంత కూడా బాగా అలసిపోయిందో మరి తెల్లారి కోర్టు కెల్లాలే! లేద్దామా? అంది నెమ్మదిగా. చేతిలో అక్షింతలు, ఓ చేత్తో గిఫ్ట్ పెట్టె పట్టుకుని పెళ్లి కూతురి మీదికి అక్షింతలు పెళ్లికూతురు ఒదినగారి చేతికి బహుమతీ ఇచ్చి బయలుదేరుతుంటే - 'అయ్యో! కాఫీ టిఫిన్ సిద్దంగా వుంది - తిని వెళ్లండి." అన్నారు - దారికి అడ్డం తగులుతూ.

"మళ్లీ భోజనానికి ఎలాగ వస్తాంగదా యింకా మీకు బోలెడు తతంగం వుంటుంది - మీ పనులు చూసుకోండి" అంటూ ఇద్దరూ బయటపడ్డారు.

"నన్ను దింపేసి వెళ్లు - నీకేం గవర్నమెంటు డాక్టరవి - ఎప్పుడెళ్లినా ఒకటే - నాకలా కాదు. నా క్లయింటు సరిగ్గా పదిగంటలకి నేను కోర్టులో నా గదిలో కనబడకపోతే గుండాగి ఛస్తాడు!" నవ్వుతూ అంది శాంత.


"గవర్నమెంటు డాక్టరంటే అంత తీసిపారేయకు శాంతా! మేం వంతులు వేసుకుని రోజుకి ఎన్ని పోస్టుమార్టమ్‌లు చేస్తామో నీకెలా తెలుసు!"

"అది అలా చెప్పు, అందుకే ప్రయివేటు ఆస్పత్రిలో మరీ సీరియస్ అయిపోతే మీ ఆస్పత్రికి తరలించమంటారు రోగిని! దగ్గిర దారి!" నవ్వుతూ కారు ఆగ్గానే దిగేసింది శాంత.

డాక్టరు జయ సమాధానం చెప్పేలోపునే శాంత మెట్లెక్కేసింది. జయ నవ్వుకుంది 'ఎంతలోకువై పోయాం!' అనుకుంటూ ముందుకు సాగింది. రోడ్డు రద్దీ లేదు గాని - ఆ చీకట్లో కూడా పట్నం నిద్ర పోనట్లు - చప్పుళ్లు విన్పిస్తూనే వున్నాయి.

కారాగిన చప్పుడు విని కాబోలు జయ తల్లి తలుపు తెరిచింది. గుమ్మం ముందేవుంచి కారు లాక్ చేసి లోపలికి నడిచింది జయ - "పెళ్లి బాగా జరిగిందటే జయా, పెళ్లి కొడుకు బాగున్నాడా" అంటూ కూతురి వెనక నడుస్తూ అడిగింది.

"ఇద్దరూ స్నేహితులేనమ్మా, ప్రేమించు




కున్నారు. ఈ రోజు పెళ్లి చేసుకున్నారు" నిట్టూ రుస్తూ మంచం మీద కూలబడింది. "ఏమిటోనమ్మా ఈ ముహూర్తంలో యీ పెళ్లిళ్లు, ఏ మనుషులు తిరిగే వేళో పెట్టుకోకూడదూ?" అంది.

కూతురి మాటకి నవ్వి "మనుషులంతా తిరుగుతున్నప్పుడు దేవతలెలా వచ్చి దీవిస్తారే! నీ పిచ్చిగాని. ముహూర్తబలం గట్టిదైతేనే - ఆ జంట జీవితం సవ్యంగా సాగిపోతుంది. పెళ్లంటే నూరేళ్ల పంటే తల్లీ! నీకేం అర్థం అవుతుంది - ఒక్క పెళ్లి కొడుకుని చూడనిచ్చావా? పోనీ ఎవరినేనీ ప్రేమించనైనా ప్రేమించావా?' కాస్త నిష్ఠూరంగా అంటున్న తల్లి ముఖంలోకి చూసి - "ఓ.కె. నేను రేపే ప్రేమించి పెళ్లి కొడుకుని నీ ముందు నిలబెడతా సరేనా!" నవ్వేస్తూ "ప్లీజ్ ఓ రెండు గంటలు పడుకోనివ్వు. తెల్లారితే - పోవాలి. ఆ శాంతని కాదనలేక పెళ్లికి వెళ్లా." అంటూ మెళ్లో గొలుసు చేతి గాజులూ తలగడ క్రింద పడేసి పడుకోబోతున్న కూతురుని చూసి నిట్టూరుస్తూ "నీ కలాగే వేళాకోళంగా వుంటుందే నా మాట. నీకు తగ్గ స్నేహితురాలు దొరికింది - పెళ్లిలో ఏముంది అంటూ!" లైట్లు ఆర్పి - ఆమె కూడా మళ్లీ నిద్రపోయే ప్రయత్నం చేశారు - కాని కూతురి మొండి వైఖరి జీర్ణించుకోలేకపోతున్నారు - "ఆడపిల్లలిలాగ ఆర్థికంగా నిలదొక్కేసుకుంటూ నలుగురికి అన్నం పెట్టే స్థితికి చేరుకుంటే - పెళ్లెందుకు చేసుకుంటారు? అదో చిన్న విషయమైపోతుంది!" ఏవేవో ఆలోచనలు పట్టి పీడిస్తుండగా ... నిద్రలోకి జారుకున్నారు.

పిడుగు పక్కనే పడ్డంత చప్పుడు చేసిందా నిశ్శబ్దంలో టెలిఫోను. ఉలిక్కిపడి కళ్లు తెరచి ఫోను అందుకుంటూ గడియారం కేసి చూసింది. ఇంకా ఆరుగంటలు కూడా కాలేదు. ఏం కొంప మునిగిందనో, అనుకుంటూనే 'హల్లో' అంది. మరుక్షణం నిద్రమత్తు తొలగిపోయి - "ఏవిటి శాంతా నువ్వనేది? నీకెవరు చెప్పారు?" నమ్మలేనట్టుగా అడిగింది.

ఇంక కూతురికి కాస్త కాఫీ సిద్ధం చేయడం మంచిదేమో అనుకుని జయ తల్లి లేచారు. కాస్త వేణ్నీళ్లు పెట్టి - కూతురి పనులు చూద్దామని. ఆమెకీ టెలిఫోనులూ, ఆశ్చర్యపడ్డాలు - ఇదిగో ఇప్పుడే బయలుదేరుతున్న పది నిముషాల్లో అక్కడ వుంటాననడాలూ అలవాటై పోయాయి. "ఇది ముహూర్తాలని రాత్రే పెట్టారనే విసుక్కుంటుంది గాని, పురుళ్లు చావులు ప్రమాదాలు... ఇవీ సరైన టైమ్‌లో రావేం అని అనుకోదేం?' సన్నటి నవ్వు ఆమె పెదవులపై కన్పించింది. కూతురంటే ఓ పక్క గర్వం ఓ పక్క వేదన ఆ తల్లికి...

"వాట్! నిజమా? అరె, ఇదెలా సాధ్యం!" అంది జయ. అటువైపు శాంత. ఆమె పెళ్లి పేరంటం అవతారం వదిలేసి క్రిమినల్ లాయర్ అవతారం ఎత్తి మాట్లాడుతోంది. "వాళ్ల నాన్నగారు వచ్చి నా కాళ్ల మీద పడ్డారు జయా - తలంబ్రాల తంతు అయి - అన్నీ సంప్రదాయసిద్దంగా చేశానని నిట్టూరుస్తున్న సమయంలో జరిగిందీ ఘోరం. పాపం అన్నివిధాలా ఓడిపోయాడా పిచ్చి తండ్రి. అంత సీనియర్ లాయరు పసివాడి లాగ ఏడుస్తుంటే - నాకేం చెయ్యాలో తోచలేదు. నేను




బయలుదేరుతున్నాను. వీలైతే రావడానికి ప్రయత్నించు" అంటూ ఫోను పెట్టేసింది శాంత.

నిద్రపోవడమే కాదు. చుట్టూ చీకటి కూడా తొలగిపోయింది జయకి. ఆదరాబాదరాగా లేచింది - 'అమ్మా నాకు టిఫిన్ చెయ్యకు - నేను తక్షణం బయలుదేరాలి." అంటూ కేకలేసింది చీర కట్టుకుంటూ.

కాఫీ పట్టుకుని లోపలికి వచ్చి "ఎంతసేపూ ఇలా వురకలూ పరుగులూ! కాస్త తిని బయలు దేరు. శాంతేనా ఫోను?" కాస్త కోపంగా అడిగారామె. తల్లి చేతిలో కాఫీ అందుకొంటూ ఆమె ముఖంలోకి సూటిగా చూసి "అమ్మా రాత్రి మేం వెళ్లిన పెళ్లి - పెటాకులైంది! అంది తాపీగా. అదిరిపడి "అదేం కర్మ పెళ్లి కొడుకు జబ్బు మనిషా?" భయంగా అడిగారు.

"కాదు గుండురాయిలా వున్నాడు. పెళ్లి కూతురే పొడిచి చంపేసిందిట. లేకుంటే శాంతకేం పని? తరవాత ఆస్పత్రి పని నాది కద!" అంటూ కప్పు తల్లికి అందించింది. "జయా" బాధగా పిలిచింది తల్లి. "ఎందుకమ్మా నీకు బాధ? ఏ తండ్రి కన్న కొడుకో - శవమై పోయాడనేగ" నెమ్మదిగా అంది.

"కాదే. ఎందుకలా చేసిందని" నీరసంగా వస్తున్న ఆమె కంఠం జాలితో నిండిపోవడం చూసి "అమ్మా! వచ్చి అంతా చెప్తాను.. ఎంత బల వత్తరమైన కారణం లేకుంటే - పెళ్లి పూర్తి కాకుండానే యీ పని చేస్తుందా ఓ ఆడకూతురు! వస్తా" అంటూ వేసుకుని హేండ్‌బాగ్ అందుకని కారు కీ చేతిలోకి తీసుకుంది జయ.

తల్లి బయటికి వచ్చేలోగా కారు బయలుదేరి పోయింది. ఏమై వుంటుంది అన్న ఊహలు చుట్టుముట్టాయి ఆ తల్లిని.

★ ★ ★

పోలీసుల కంటే ముందే శాంత పెళ్లి పందిరిలోకి ప్రవేశించింది. శాంత ప్రాక్టీసు ప్రారంభించిన కొత్తల్లో పెళ్లికూతురు తండ్రితో ఓ ఏడాది పనిచేసింది. అప్పటికే ఆయన చాలా పెద్దవారు. వయస్సు పైబడడానికి తోడు బాధ్యతలు తీరలేదని ఆయన చాలా బాధపడేవారు. ఎన్నోసార్లు అన్నారు కూడా "ఈ కాలం పిల్లలకి ఏం కావాలో వాళ్లకే తెలియదమ్మాయి. తీరా నచ్చిందనుకున్నది - అందుకునేందుకు వెనకాడుతారు". "సార్ ఇలా తిప్పి తిప్పి చెప్పడం దేనికి? మీ అమ్మాయి ఎవరినో ప్రేమించిందని, పరువు తీస్తోందని మామి చెప్పారులెండి! ఆ అబ్బాయినే చూస్తే సరిపోతుంది కదా సార్. మీ పని సులభం చేసింది మీ అమ్మాయి అని ఎందుకనుకోరు?" నవ్వుతూనే అడిగేది.

కాని తరువాత ఆయన కోర్టుకి రావడం తగ్గించేశారు. ఉన్నట్టుండి పెండ్లి పిలుపుకి ఆయనా - మామీ వచ్చారు. తప్పకుండా రా అమ్మాయి - నీ ఫ్రెండు జయని కూడా పిలిచాను" అన్నారు. అందుకే తప్పనిసరిగా యిద్దరు ఆ పెద్దాయిన మీద వున్న గౌరవం కొద్దీ యీ అర్థరాత్రి ముహూర్తంకి వచ్చారు.

అలాంటిది తెల్లారేసరికి....... యీ పిలుపు.

శాంతని చూస్తూనే మామీ "చూశావా అమ్మా - ఇది ఎంత పని చేసిందో.." అంటూ భోరున ఏడవడం ప్రారంభించారు. పందిరంతా బోసి పోయింది. చూసిన సంగతికి సాక్ష్యం చెప్పవలసి వస్తుందేమో అని దగ్గర చుట్టాలు కూడా వెళ్లిపోయి నట్టుంది!

"పోలీసులకి ఫోను చేశారా?" నెమ్మదిగా పెద్దాయనని అడిగింది. ఆయన పేలవంగా నవ్వి "నేను పిలవక్కర లేదమ్మాయి. అబ్బాయి తండ్రి వాళ్లని వెంటపెట్టుకురావడానికి వెళ్లాడు".

"ఫరవాలేదు సార్. ఇప్పుడు మనం చేయకల్గిందేమీ లేదు. అమ్మాయి ఎక్కడ?" అడిగింది.

"లోపలికి లాక్కెళ్లి గదిలో పెట్టింది వాళ్లమ్మ."

"ఏమైనా చెప్పిందా మీకు - అదే ఎందుకిలా చేసిందని?" అడగకూడదనుకుంటూనే అడిగింది శాంత.

"ఆ దరిద్రపు ముఖం చూడడానికే నాకిష్టం లేదు! వాడిని చంపే బదులు తను చావవలసిందమ్మా - నాకే ఘోష లేకుండా పోయేది." కసిగా అన్నారు.

"మీరే అలా అంటే ఎలా సార్..."

"వాడిని ప్రేమించిందమ్మా, వాడినే చేసు కుంటానని ఒంటికాలుమీద నిలబడింది .... ఇక ఏం చేయను. వాళ్లమ్మ చెప్పింది... ఇక తప్పదు కాళ్లు చేతులు పట్టుకుని- నేను ఈ పెళ్లి జరిపించమని... శాంతా, నీకు తెలియదమ్మా.... వాళ్లు ఎంత అవమానకరంగా... ఎంత కసాయి వాళ్లలా నాతో మాట్లాడారో...చెడిపోయి నెల తప్పిన పిల్లని చేసుకోడానికి మా కర్మకాలిందా! అంటూ మొదలెట్టి పాప పరిహారంగా మూడు లక్షలు, ఈ ఇంటి మీద అప్పు తెచ్చి యిచ్చా.... ఇక నగలన్నారు, నట్రన్నారు... ఇది పెళ్లి కాదమ్మాయి..." అంత పెద్దాయన కంట తడి పెట్టుకోవడం భరించ లేకపోయింది శాంత. "ఛ అలా డీలాపడితే ఎలా సార్... ఏదో దారి కనబడకపోతుందా!"

"అసలెందుకు ఒప్పుకొందమ్మా యీ పెళ్లిని? అది చెప్పి చావదేం? అది మనిషా! రాయా?"

"నేను మాట్లాడనా?" నెమ్మదిగా అడిగింది.

"వద్దు వద్దు. ఆ పోలీసులు యీడ్చుకుపోనీ... దాన్ని... ఉరిశిక్ష పడనీ దానికి..." కోపంగా అన్నారు.

"మీరిప్పుడిలాగే అంటారు. తరువాత మన ప్రయత్నం మనం చేయకుండా వూరుకోగలమా? అదిగో పోలీసులు వస్తున్నట్టుంది..." మాటలు మానేసింది శాంత.

"కమ్.. కమ్... ఏదీ బాడీ! హంతకురాలెక్కడ? హత్యకు వాడిన ఆయుధం ఎవరూ ముట్టుకోలేదుకదా!" అంటూ ఓ ఇన్స్పెక్టరు పోలీసులు ఫోటోగ్రాఫరు... అంతా హడావిడిగా మంటపం చేరారు. పెళ్లికొడుకు - పెళ్లి పీట పక్కనే నేలకొరిగి వున్నాడు. అప్పుడే శాంతా చూసింది. ఇన్స్పెక్టరుతో పాటు ఆ స్థలానికి నడిచింది.

"ఎంత దారుణం - తక్షణం పోయివుంటాడు. ఎంత కసిలేకపోతే - ఇలా?" ఏదో అనబోతున్న ఇన్స్పెక్టరుకి తనని తాను పరిచయం చేసుకుంది శాంత.

ఇంతలో డాక్టర్ జయ కారు దిగింది. పోలీసు జీపు, హడావిడి చూసి లోపలికి వెడదామా వద్దా అని క్షణం ఆలోచించింది. తరువాత లోపలికి నడిచింది.

పోలీసులు చేయవలసినదంతా చేశారు. సాక్ష్యాదారాలని భద్రంగా సేకరించి - ముద్దాయితో మాట్లాడాలి... స్టేషన్కి తీసుకువెళ్తాం. అక్కడే..." అంటున్న ఇన్స్పెక్టర్ని ఆపుతూ "మీరామె దగ్గర స్టేట్మెంటు ఇక్కడే తీసుకోవచ్చును ఇన్స్పెక్టర్. అదిగో డాక్టర్ జయ కూడా వచ్చింది. మేం రాత్రి పెళ్లికి వచ్చిన వాళ్లమే. కాని మేం వెళ్లిపోయాక జరిగిందీ దారుణం. నేనూ ఇంకా పెళ్లి కూతుర్ని చూడలేదు. అంచేత మీకు అనుమానం అక్కరలేదు. ప్లీజ్" అంది కాస్త ప్రాధేయ పడుతున్నట్టు.

క్షణం తటపటాయించాడు ఇన్స్పెక్టర్. తరవాత "సరే పదండి" అన్నాడు. "బాడీ పోస్టు మార్టమ్కి పంపించండి" అని ఆర్డర్ వేసి.

"మీరుండండి సార్ నేను జయా వుంటాం కదా!" అని పెద్దాయినని వారించింది శాంత.

గదిలో ఒక మూల మోకాళ్ల మీద తల పెట్టుకుని కూర్చుని వుంది పెళ్లి కూతురు.

"ఇటు చూడు. జరిగినదేమిటో - ఎందుకలా చేశావో నువ్వు వివరంగా ఇన్స్పెక్టరుగారికి చెప్పు. ఫరవాలేదు. ఏం దాచకు" ధైర్యం చెప్తున్నట్టుగా అంది శాంత.

పెళ్లికూతురేం బెదురుగొడ్డులా లేదు. గంభీరంగా వుంది. "నేను అతన్ని పొడిచి చంపాను." అంది.

"తెలుస్తూనే వుంది. ఎందుకలా చేశావు?" తీవ్రంగా అడిగాడు ఇన్స్పెక్టర్. శాంత ముఖంలోకీ, జయ ముఖంలోకీ చూస్తూ వాళ్లకి చెప్తున్నట్టు చెప్పింది అమ్మాయి.

"నేను ప్రేమించాను. అతని బలవంతం మీదే లొంగిపోయా, త్వరలో పెళ్లి చేసుకొంటాం కదా అని. కాని పెళ్లికి వాళ్ల పెద్దలతో మాట్లాడమన్నాడు. వాళ్లు నాన్నగారిని చాలా చాలా అవమానించారు. 'చెడిపోయింది' అంటూ పదే పదే చెప్పారు. నేను గర్భం తీయించుకోవచ్చు. కాని వాళ్లు వేస్తూన్న అభాండాలకి పెళ్లి తప్పించి దారి లేదని నాన్న మొండిగా వున్నారు. పెళ్లితో వచ్చిన 'చెడ్డ' పేరు పోతుందని నాన్న నమ్మారు. కాని అతను నన్ను క్షణ క్షణం వేధించాడు. ఎలాగ చెడ్డావన్నాడు? అంటూ నన్ను పదే పదే శారీరకంగా లొంగ తీసుకోవడం ప్రారంభించాడు. పెళ్లి రోజు వచ్చేసరికి - నాపై నాకే అసహ్యం, అతని మీద ద్వేషం పెరిగిపోయింది. ఇలాంటి మనిషితో కలిసి బ్రతకడం కాపురం అవుతుందా? సంసారం అవుతుందా! సుఖంగా వుండగలనా? ఎన్నో అనుమానాలు. కాని చెప్పుకుందుకు ఎవరూ లేరు... "చెడినదానివి" అనే అతన్ని నేనేం చేయగలను! ఈ మాట ఒక ఆయుధంలా నామీద ఉపయోగించడా? పెళ్లి చేసుకుని సానుభూతి లేకుండా చేసుకోనా? పెళ్లి కొడుకుని చంపి సానుభూతి సంపాదించుకోనా? అన్న తుఫాను రేగింది నాలో. పెళ్లయ్యాక అయితే నేనతని భార్యను. పెళ్లవగానే చంపితే నేను వితంతువుని అవుతాను. అంతా అయ్యో అంటారు." నవ్వింది అమ్మాయి. "శిక్ష అనుభవిస్తాను. ఏ ఆదర్శ పురుషుడో నన్ను చేపట్టడానికి ముందుకి రాడా? 'చెడిపోయిన' ఆడదానికంటే వితంతువు మీద జాలి దయ రక్షణ యివ్వాలన్న కోరిక కల్గుతుంది కదా?" అంటూ రెండు చేతులూ ముందుజాపింది సంకెళ్లు వేయమని. శాంత జయ ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు. సంతకం పెట్టడానికి - కాగితం ముందుకి తోశాడు ఇన్స్పెక్టర్. ఆయన అందించిన కలం అందుకుని సంతకం చేసింది. 'మీరు సాక్షి సంతకాలు చేయండి' అంటూ శాంతకి అందించాడు ఇన్స్పెక్టర్. ఇద్దరూ సంతకాలు చేశారు. సంకెళ్లు పడ్డానికి ముందు శాంత అంది "సార్ కాస్త బట్టలు మార్చుకురానివ్వండి" అని. అమ్మాయి మామూలు చీర కట్టుకుని వచ్చింది. ఆమె ముఖంలో ఏ అలజడీ లేదు.

సంకెళ్లు పడ్డ రెండు చేతుల మీదా గోరింటాకు... ఎర్రగా కన్పిస్తుంది. 'సారీ మేం తీసుకెళ్లక తప్పదు, ఈ రోజే కోర్టులో ప్రెజెంట్ చేసి తరలిస్తాం." అంటూ బయలుదేరాడు ఇన్స్పెక్టర్.

"నాన్నకి చెప్పండి. ఆయన అవమానాన్నే కాదు, నా అవమానాన్ని తుడిచేసుకుంటాను - నాకింకో మార్గం తోచలేదు.." జీపు ఎక్కి కూర్చుంది.

"ప్చ్. మాన్స్లాటర్. ఎంత వాదించినా ఐదో ఏడో సంవత్సరాలు పడక తప్పదు" అంది శాంత నిట్టూరుస్తూ. వెలుతురు వచ్చినట్లే అన్పించలేదు ఇద్దరికీ. ❋

